జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 15-02-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 592 పేజీలు: 4 వెల : రూ.7



## శ్రీముఖలింగం.. శోభాయమానం

-పూల సోయగాల్లో మెరుస్తున్న శ్రీముఖలింగేశ్వరాలయం

-మహాశివరాత్రి మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా సిద్ధమైన క్షేత్రం

- భక్తుల సందడితో వెల్లివిరిసిన కళ

**జలుమూరు, ఫిబ్రవరి 14(వార్త):** జిల్లాలోని ప్రఖ్యాత శైవక్షేత్రమైన శ్రీముఖలింగేశ్వరాలయం మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పూల అలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పురాతన శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబించే ఈ ఆలయం భక్తి ప్రపత్తులతో కళకళలాడుతోంది. ఆలయ ప్రధాన ద్వారం నుంచి గర్భగుడి పరిసరాల వరకు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశముండటంతో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వెలుగులు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రంతా జరిగే జాగరణ, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. శిల్పకళా వైభవంతో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయం శివరాత్రి సందర్భంగా పుష్పసౌందర్యంతో మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. పూల పరిమళాలతో పరవశించే ఈ క్షేత్రం భక్తి భావాన్ని మరింత రెట్టింపు చేస్తూ మహాశివరాత్రి మహోత్సవాలకు సిద్ధమవుతోంది. ఆలయ సర్వాంగ సుందర అలంకరణ భక్తులను ఆకట్టుకుంటూ ఆధ్యా త్మిక ఆనందాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఏడుకొండలు మాట్లాడుతూ, "శివరాత్రి మహోత్సవాల దృష్ట్యా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నాం. ప్రధాన ద్వారం, ముఖ మండపం, ప్రదక్షిణ మార్గం, యాగశాల ప్రాంతాల్లో సంప్రదాయ పుష్పాలతో అందంగా అలంకరణ చేపట్టాం. భక్తుల ఆధ్యాత్మిక ఆనందం కోసం అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు ఇచ్చిన సూచనలను మాత్రం ఆలయ అధికారులు తుంగలో తొక్కి తమకి నచ్చినట్టు ఏర్పాట్లు చేస్తున్నారని ఆయనను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. వచ్చే భక్తు లకు ఎంతసేపటిలో దర్శనం పూర్తవుతుందని ప్రశ్నించగా ఆలయ అధికారులు కానీ, పురోహితులు కానీ సరిగ్గా సమాధానం ఇవ్వలేదు.





## ఇచ్ఛాపురం మండల సమావేశం .. రసాభాస

-సభలో ప్రొటోకాల్ గందరగోళం -వైస్సార్సీపీ, కూటమి సభ్యుల మధ్య ఘర్షణ-వాకౌట్ చేసిన వైస్సార్సీపీ సభ్యులు

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14(వార్త):** అధికారులు ప్రొటోకాల్ పాటించరా? వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అంటే లెక్కలేదా? ఎందుకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వైసీపీకి చెందిన ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రసాద్ అధికారులను నిలదీశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఇటీవల మండపల్లి పంచాయతీలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభానికి స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు పిలవకుండా ఎందుకు అవమానించారు. వైసీపీ ప్రజా ప్రతి నిధులంటే మీకు లెక్కలేదా? శిలాఫలకం మీద కనీ సం జడ్పీచైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌ల పేర్లు ఎందుకు రాయలేదు. పనులకు మేము కావాలా.. కార్యక్రమానికి పిలవకుండా అవమానిస్తారా అని సర్పంచులు నర్తు ప్రసాద్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకా నంద రెడ్డి ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరిని నిలదీశారు. సమావేశ వేదికపై పీఏసీసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబీ కూర్చొని ఉండటంతో ప్రసాద్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏ ప్రొటోకాల్ ప్రకారం పీఏసీఎస్ అధ్య క్షుడు కూర్చొన్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై సర్పంచ్-పీఏసీఎస్ అధ్యక్షుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో వైసీపీకి చెందిన ఈదుపురం ఎంపీటీసీ సభ్యుడు దువ్వు వివేకానంద పీఏసీఎస్ అధ్యక్షుడితో వాగ్వివాదం చేస్తూ పోడియం మీదకు దూసుకెళ్లారు. ఇది టీడీపీ-వైసీపీ ప్రజా ప్రతినిధుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఇరువురి మధ్య ఘర్షణను ఆపేందుకు ఎంపీడీఓతోపాటు ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తిప్పలు పడ్డారు. చివరికి గొడవ సద్దుమణిగింది. అనంతరం సమావేశం నుంచి వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వాకౌట్ చేయగా, టీడీపీ ప్రజా ప్రతినిధులు కూడా వెళ్లిపోవడంతో అధికారులు సమావేశాన్ని ముగించారు. సమావేశంలో విద్యుత్ అధికారుల తీరుపై ధర్మపురం సర్పంచ్ ప్రతినిధి ధ్వజమెత్తారు.



## వేప చెట్టు నుంచి పాలు


-మాకన్నపురంలో చోటు చేసుకున్న ఘటన

- వింతను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం



**సోంపేట, ఫిబ్రవరి 14(వార్త):** మాకన్నపురంలో శనివారం ఓ వింత చోటు చేసుకుంది. గతంలో ఎక్కడెక్కడో జరిగిన వింతల మాదిరిగానే ఇక్కడ కూడా గున్న వయస్సు గల ఓ వేప చెట్టు నుంచి తెల్లని పాల వంటి ద్రవం కారణాన్ని ముందుగా గ్రామానికి చెందిన రైతు శనివా రం మధ్యాహ్నం గమనించారు. ఆయన ఆశ్చర్యపోతూ ఈ విషయాన్ని గ్రామస్తులకు ముందుగా చెప్పాడు. దీంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని నిర్మాణంలో ఉన్న పాలపోలమ్మ ఆలయం వద్ద గల వేప చెట్టులో నుంచి విసర్జింపబడుతున్న పాల వంటి ద్రవాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. చుట్టుపక్కల గ్రామాలకు కూడా తెలియడంతో పెద్ద సంఖ్యలో చెట్టు వద్దకు హాజరై రకరకాలుగా చర్చించుకున్నారు. కొంతమంది ఈ ద్రవాన్ని రుచి చూసి తీయగా ఉందంటూ పేర్కొన్నారు. వేప చెట్టు నుంచి వచ్చే ద్రవం చేదుగా ఉండాలి కానీ తీయగా ఉండడం మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఏది ఏమైనా ఇది కూడా ఓ వింత సంఘటన అంటూ సదరు వేపచెట్టు ఫొటోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై స్థానిక సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ఎన్నడూ చూడని ఇటువంటి వింత సంఘటన గ్రామంలో చోటు చేసుకోవడం ఒక వింత అనుభూతి అన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి



- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి14(వార్త):** ప్రముఖ శైవ దేవాలయాలైన ఎండల మల్లికార్జున స్వామి, ఉమారుద్ర కోటేశ్వరస్వామి, మహేం ద్రగిరుల్లోని ప్రముఖ దేవాలయాల్లో మహా శివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదే శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డితో ఫోన్ ద్వారా మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో ఈ నెల 18 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్న మంత్రి, వారందరికీ సంతృప్తికరమైన దర్శనం కల్పించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వంశ ధారలో పుణ్యస్నానాలు ఆచరించే సమ యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండా లని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల్లో ఎక్కడా అంతరాయం కలగకూడదని కలె క్టర్‌కు స్పష్టం చేశారు. భద్రతా పరంగా దేవాలయ పరిసరాల్లో నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉండాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచిం చారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల సమ యంలో భక్తుల రక్షణ కోసం గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షణతో మహాశివరాత్రి వేడుక లను విజయవంతం చేయాలని మంత్రి అచ్చె న్నాయుడు అధికారులను కోరారు.

## పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు

-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14(వార్త):** నులిపురుగులు లేని ఆరోగ్యకరమైన జిల్లా కోసం పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె అనిత అన్నారు. జిల్లాలో ఈ నెల 17న డీ వార్మింగ్ డే నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,27,000 వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ -400 మీ.గ్రా మాత్రలు పంపిణీ చేసి.. అక్కడే పిల్లలతో మాత్రలు వేయిస్తామని ఆమె పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రక్తహీనత లేని సమాజ స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. 1-19 సంవత్సరాల లోపు వారు విధిగా నులిపురుగుల నివారణకు ఈ మాత్రలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది (ఉపాధ్యాయులు), అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో జరుపుతామన్నారు. జిల్లాకు సంబంధించి ఐదు లక్షల ఏడు వేల మాత్రలు వచ్చాయని, పిల్లలంతా విధిగా వేసుకోవాల న్నారు. పాఠశాలలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక పద్ధతిలో ఈ కార్యక్రమం జరుపుతామన్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత ప్రతి విద్యార్థికి ఒక మాత్ర (ఆల్బెండజోల్ -400 మీ.గ్రా.) నమిలి తినిపించడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షకుడిగా నియమిస్తామన్నారు. ఆ గ్రామాలలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. దుష్ప్రరిణామాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పి.హెచ్.సి వైద్యాధికారిని సంప్రదించాలని ఆమె సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు.. కళాశాలలు.. కేజీబీవీ స్కూల్స్, అంగన్వాడీ స్కూల్స్ మొదలగు విద్యా సంస్థలకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది వెళ్లి ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం, పాదరక్షలు ధరించడం, ఆహారం, నీటిని శుభ్రంగా ఉంచుకోవడంతో నులి పురుగుల నిర్మూలించవచ్చన్నారు. కావున అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి జాతీయ నులి పురు గుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు సహకరించాలని ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాందాస్, డాక్టర్ శివరంజని, డాక్టర్ బి.రవీంద్ర, డోమ అప్పలనా యుడు



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వైకాపా అభివృద్ధికి మహిళా విభాగం కృషి

**మందస, ఫిబ్రవరి 14(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మహిళా విభాగం కృషి చేస్తోందని మహిళా నాయకులు అన్నారు. వైకాపా మందస మండలం మహిళా విభాగం అధ్యక్షురాలు, కొత్తపల్లి సర్పంచ్ సేనాపతి దివ్య ఆధ్వర్యంలో మందసలో జరిగిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఈ సమావేశాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రణాళికాబద్ధంగా మహిళకు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మహిళా విభాగం మరింత చక్కగా పని చేయాలని పార్టీ పలాస నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సుజాత పండా అన్నారు. ప్రతీ గ్రామంలో, పంచాయితీలలో మహిళా విభాగం బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ లో మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులను వ్యక్తిగతంగా వెళ్ళి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగిందని వారు తెలిపారు. మహిళా విభాగం బలోపేతం కోసం కృషి చేస్తున్న ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మందస మండలం మహిళా అధ్యక్షరాలు సేనాపతి దివ్య, ఉప అధ్యక్షురాలు తెప్పల జానకి, సెక్రటరీలు రట్టి శారద, నగిరి పుష్ప, అరుణ బెహరా, నాగ దమయంతి, సెక్రటరీ బల్ల లీలకుమారి తదితరులు పాల్గొన్నారు.




## ఉద్దానంలో గ్రామ కమిటీల ఏర్పాటు




**మందస, ఫిబ్రవరి 14(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉద్దానంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా లొహరి బంద, గొల్లలపాలెం, నొల్లూరు, కొత్తపితాలి, గెడ్డవూరు తదితర గ్రామాలలో వంశధార సాగునీరు సాధన కమిటీ ప్రచారం, గ్రామ కమిటీలు ఎంపిక జరిగింది. కార్యక్రమంలో వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావుచౌదరి, శశిధర్ వర్మ, వాయలపల్లి వరప్రసాదరావు, పులారి దుర్యోధన, కొవ్వూరు దశరధి, వాయలపల్లి మాధవరావు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రక్తదానంతో 'అరుణ్' ఔదార్యం



**మందస, ఫిబ్రవరి 14(వార్త):** ఎవరు ఎలా పోతే మాకేంటి అనుకునే రోజుల్లో కూడా కొంతమంది తమ ఔదార్యం చాటుకుంటున్నారు. చేతనైన సేవ చేస్తున్నారు. సమాజసేవలో భాగమవుతున్నారు. మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన మద్ది అరుణ్ కుమార్ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. హరిపురంలో మొబైల్ షాపు నిర్వహిస్తున్న ఆయన రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్నారు. పుల్వామా అమరవీరుల సంస్మరణలో భాగంగా శ్రీఅభయ ఆంజనేయ మొబైల్ టెక్నీషియన్ వెల్ఫేర్ యూనియన్(పలాస-కాశీబుగ్గ) ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అరుణ్ రక్తదానం చేయడానికి పలాస వెళ్లి మరీ రక్తదానం చేశారు. అరుణ్ ఔదార్యంపై స్థానికులు ఆయనను అభినందించారు.

## శ్రీముక్తేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు




**మందస, ఫిబ్రవరి 14(వార్త):** మూలిపాడు లో గల శ్రీముక్తేశ్వరాలయంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు చెప్పారు. ఉదయం 5గంటలకు విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, 9గంటల నుంచి 4గంటల వరకు శ్రీసాయి భజనమండలి మాస్టార్ వీరయ్య, లక్ష్మి(రేడియో ఆర్టిస్) యలమంచిలిపుట్టుగ ఆధ్వర్యంలో గాన కచేరి, నామసంకీర్తన, 7గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు ఉదాసాహు (డోలకిస్ట్, కేశుపురం), గణేశ్ బృందంతో హెున్నాళి హరేరామ, హరేకృష్ణ భజనా కార్యక్రమాలు నిర్వహించబడుతుందన్నారు. అదేవిధంగా భక్తులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని ముక్తేశ్వరుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## బ్రహ్మోత్సవాల్లో కొనసాగిన సంప్రదాయం


### -సముద్రంలో విహరించిన వాసుదేవుని భక్తులు





**మందస, ఫిబ్రవరి 14(వార్త):** శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాల అనంతరం వస్తున్న సంప్రదాయాలను జీయర్ స్వాములు, భక్తులు కొనసాగించారు. బ్రహ్మోత్సవాల అనంతరం సముద్రంలో ప్రతీ ఏటా తెప్పలో తిరుగుతారు. అదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా నిర్వహించారు. శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు శానాపతి కిషోర్ కుమార్, దేవరశెట్టి మార్కండేయులు, కరతల తిరుపతిరావు, మాదిన వెంకటరమణ, యువకులు బారువా తీరానికి వెళ్లి, సముద్రంలో విహరించారు. బ్రహ్మోత్సవాలో భాగంగా జరిగే ఈ క్రతువుకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు తెలిపారు.

## ఘనంగా తమరాల వర్ధంతి

**కంచిలి ఫిబ్రవరి 14(వార్త):** కంచిలి మండల పరిధి మకరాంపురం గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, వ్యాపారవేత్త దివంగత తమరాల రమణమూర్తి (73) ప్రథమ వర్ధంతి కార్యక్రమం శనివారం వారి స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. రమణమూర్తి కుమారుడు ప్రస్తుత సర్పంచ్ ప్రతినిధి తమరాల శోభన్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు , అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రమణమూర్తి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు నాయకులు రమణమూర్తి సేవలను గూర్చి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి పార్టీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలు అందిస్తూ అనేకమార్లు పంచాయతీ సర్పంచ్ గా వారి కుటుంబీకులు బాధ్యతలు నిజాయితీగా నిర్వహిస్తూ ప్రతి సేవా కార్యక్రమంలోనూ ముందుంటూ పంచాయతీలో ఎంతో అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. రమణమూర్తి ఎంతోమందికి ఆదర్శనీయుడని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంగీత కళాకారులచే నిర్వహించిన స్వరాభిషేకం అందరినీ ఆకట్టుకుంది.



# 'ఆనందగిరి' మెట్టపై వెల్లివిరియనున్న ఆధ్యాత్మికత



### -శివరాత్రికి ముస్తాబైన ఆలయం

### -ఏర్పాట్లు చేసిన ఆలయఅభివృద్ధి కమిటీ

**మందస, ఫిబ్రవరి 14(వార్త):** మందస శివార్లో గల ఆనందగిరి మెట్ట మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యింది. మెట్ట మీద గంగాధర గరుడ గోవిందాలయాన్ని మందస సంస్థానాధీశులు నిర్మించారు. మహేంద్రగిరుల మాటున ఆనందగిరి మెట్టపై వెలసిన శ్రీగంగాధర గరుడ గోవిందాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో భక్తులు, దాతలు సహకారంతో పునఃనిర్మించారు. ప్రస్తుతం ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. గంగాధరుని దర్శించుకోవడానికి శివరాత్రి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. దీంతో నిర్వాహకులు ప్రతీ ఏటా తీర్థ, ప్రసాదాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆలయాన్ని, పరిసరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణ కనువిందు చేస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గంగాధర గరుడ గోవిందాలయం ఆలయ ఫౌండింగ్ మెంబర్ డాక్టర్ పట్నాల మోహనాచారి ఆధ్వర్యంలో మందస బస్టాండ్ లో శివరాత్రి భక్తులకు అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. గంగాధర గరుడ గోవిందాలయాన్ని దర్శించుకుని, గంగాధరుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.




# ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం

### -విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

### -ప్రోత్సహిస్తున్న సిండికేట్

### -లైసెన్స్ షాపుల తరహాలో మద్యం అక్రమ అమ్మకాలు

### -అధిక ధరలకు మద్యం విక్రయించే వారిపై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి

### -అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తే.. ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

### -పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా)

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** మద్యం పాలసీ గురించి గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వంలో ఎమ్మార్పీ ధరల కంటే పెంచి మద్యం విక్రయాలు చేయడం దారుణమని, ప్రధానంగా పలాస నియోజకవర్గంలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న సిండికేట్లు పేద ప్రజలను దోచుకుంటున్నారని పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్(బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ " ఎమ్మార్పీకి మించి మద్యం అమ్మకాలు చేసినా, బెల్ట్ షాపులు ఏర్పాటుచేసిన మొదటిసారి రూ. 5 లక్షలు జరిమానా విధించాలని, రెండోసారి తప్పు చేస్తే షాపు లైసెన్స్ రద్దు చేయాలి"... అంటూ గతంలో ఎక్సైజ్ శాఖలో సమీక్ష సందర్భంగా మద్యం అమ్మకాలపై సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని, ఈ హెచ్చరికలను పలాస మద్యం సిండికేట్ వర్గాలు ఏ మాత్రం సీరియస్ గా తీసుకోవడం లేదని దువ్వాడ శ్రీధర్(బాబా) గుర్తు చేశారు. షరా మామూలే అనుకున్నారేమో.. నిబంధనలు పక్కనపెట్టి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగించడమే కాక గ్రామాలలో కూడా బెల్ట్ షాపులు వీధి వీధినా విస్తరింప చేస్తున్నారని ఆయన ఆగ్ర హం వ్యక్తం చేశారు. పలాసలో ఒక ముఖ్య కీలక నేత కను సన్నలలో మద్యం అమ్మకాలు మూడు ఫుల్ బాటిల్స్.. ఆరు బీర్లు అన్నట్లుగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని ప్రదేశాలలో సైతం అన్ని వేళలలోను మద్యం అందుబాటులో ఉంటుందని ఆయన మండిపడ్డారు. మద్యం వ్యాపారంలో ఆరితేరిన ఒక కీలక టిడిపి నేత నిబంధనలకు పాతరేస్తు, దర్జాగా అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తూ, బెల్ట్ షాపులు విస్తరింపచేస్తూ, ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ, మద్యం వ్యాపారం అడ్డు అదుపు లేకుండా కొనసాగిస్తున్న తీరు దారుణమన్నారు. కోట్ల రూపాయల వ్యాపారం కొనసాగడంతో ఎక్సైజ్ శాఖ అధికారుల చేతులలో అక్రమంగా లక్షల్లో సొమ్ములు చేతులు మారడంతో అధికారులు ఏమి పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అధిక ధరలకు అమ్మకాలు కొనసాగించడమే కాక వేళా పాల లేకుండా 24 గంటలు విక్రయాలు జరుగుతున్న పలాస సిండికేట్లు ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలను మించి.. క్వార్టర్ పై రూ. 20 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, ఇంతగా మద్యపాన వినియోగదారుల నుంచి దోపిడీ చేస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు లంచాల మత్తులో జోగుతున్నారని ఆయన మండిపడ్డారు. మద్యం దుకాణంలో ఎంఆర్పి కంటే అధిక ధరలకు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా హెచ్చరించారని ఆయన గుర్తు చేశారు. దేశంలో కొందరు ఎమ్మెల్యేలు అక్రమ కట్టడాలను, బెల్ట్ షాపులను స్వయంగా బుల్డోజర్లతో కూల్చివేసి కఠిన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయని, మరి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్న మద్యం సిండికేట్ లపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూస్తామన్నారు. లేకపోతే తామే స్వయంగా ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దువ్వాడ శ్రీధర్(బాబా) హెచ్చరించారు.



# సామాజిక సంస్కరణలకు నిలువుటద్దం సంజీవయ్య



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (వార్త):** దామోదరం సంజీవయ్య నిరాడంబరతకు మరియు సామాజిక సంస్కరణలకు నిలువుటద్దమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి(ఎఫ్ ఏ సి) కె.వినాయకం అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.వినాయకం మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి, కష్టాలతో చదువు పూర్తి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 27 నెలల పాటు ఆయన పనిచేశారన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఒక రికార్డు అని ఆయన అన్నారు. దామోదరం సంజీవయ్య 38 ఏళ్ల పిన్న వయసులో ముఖ్యమంత్రిగా, రెండు సార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఙూ×జజ) అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన నిష్కళంక, నిజాయితీ కలిగిన నిస్వార్ధ నాయకుడని పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారిశ్రామికాభివృద్ధికి, ప్రభుత్వంలో తెలుగు వాడకానికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి తొలి దళిత అధ్యక్షుడిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారని, ఖాళీ సమయంలో కవిత్వం, సాహిత్య వ్యాసాలు రాసేవారన్నారు.ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన నేతగా సంజీవయ్య చిరస్మరణీయులని పేర్కొన్నారు. సంజీవయ్య రిక్షాలో అసెంబ్లీకి వెళ్లేవారని, అత్యంత నిజాయితీపరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలరావు,తోట రాము, దండాసి రాము బాబు, రెల్లి సంగం ప్రెసిడెంట్ అర్జి కోటి, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పాండురంగ విగ్రహానికి స్వాగతం పలికిన గ్రామస్తులు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త):** మశాఖపురం గ్రామ పంచాయతీ లో నూతనంగా నిర్మించిన పాండురంగ స్వామి దేవాలయంనకు కృష్ణ శిలా విగ్రహాలు ప్రథమంగా విచ్చేసిన సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలతో గ్రామ ప్రజలు మహిళలు ఆలయ అభివృద్ధి కమిటీ, భాజా భజంత్రీలు నడుమ పూర్ణకుంభ స్వాగతం పలుకుతూ, హారతులిచ్చి కోలాహలంగా గ్రామ పొలిమేర నుంచి నూతన దేవాలయం వరకు తిరువీధి నిర్వహించి స్వామివారిని ఆలయ ప్రాంగణమునకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంగాల హేమావతి, మహతి సాంస్కృతి కళా సేవా సంస్థ అధ్యక్షులు రంగాల జానకి రామ్ రెడ్డి, ఆశి లోకనాదం, పాల గణేష్, కాతిల దేవరాజు, పాల రామయ్య, నాగిరెడ్ల సింహాద్రి, నాగిరెడ్ల చిరంజీవి, ఆసి ఉమామహేశ్వరరావు, పాల వెంకటేష్, పాల తమ్మయ్య, దూడ రాజేష్, కాతిల జగ్గయ్య, కాజల్ జగ్గారావు, కొత్తపల్లి భీమరాజు, ఆసి మహేష్, కొయ్య రవి, అంబటి దుర్యోధన, చాట్ల బాబయ్య, గేదెల రామచంద్ర, గేదెల నిమ్మయ్య, అనపాన రామయ్య, పాల రామయ్య, బోర పేరయ్య, వికాస తరంగిణి భక్త సమాజం, గ్రామ మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పుల్వామా దాడి అమర వీరులకు నివాళులు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన జవాన్లకు స్కూల్ చైర్మన్ డి. కృష్ణ మూర్తి రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర దాడిలో అమరులైన జవాన్లకి స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, రాజ్యలక్ష్మి, శ్రీధర్, యశోద, మీనా స్నేహ, పార్వతి, సరోజిని, ప్రమీల ఎస్ పి యల్స్ జిహారిక, యువ శ్రీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. మండలం ఈదుపురం గ్రామంలో పుల్వామా అమరులకు కాండిల్ ర్యాలీ నిర్వహించారు. బ్లాక్ డే నిర్వహిస్తూ, దాడిలో వీరమరణం పొందిన 40 మంది భారత జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హంగీర్ బేహారా, సొసైటీ ప్రెసిడెంట్ రామచంద్ర బెహరా, జలంధ్ర, పూర్ణచంద్ర, చార్లెస్, పాల్, జీత, బుసదేవ్, దినాబాద్ తదితరులు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుల్వామా అమరులకు గ్రామ ప్రజలు ఘనంగా జోహార్లు తెలియజేశారు.

## పర్యావరణ కార్యక్రమాలపై బ్రోచర్ విడుదల



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14(వార్త):** జిల్లాలో నిర్వహించనున్న పర్యావరణ కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం తన కార్యాలయంలో జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ తో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, శుభ్రమైన వాతావరణం కోసం ప్రజలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ..

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త)'** భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22న విజయవాడ పూలే-అంబేద్కర్ ప్రాంగణం నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా రాష్ట్ర జాతీయ అధ్యక్షులు రామచంద్రయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న బీసీ సింహ గర్జన కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బడ్డీ మురళీ పిలుపు నిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో సింహగర్జన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు బీసీ ఎసీసీ,ఎస్టీ మైనార్టీ కులాలుకు తీవ్ర అన్యాయం జరుగుతుంది రాజ్యాధికారానికి ఆమడ దూరంలో బీసీలు ఉన్నారు. రాష్ట్రంలో 17సార్లు ముఖ్యమంత్రులు కాగా అందులో ఒకేఒకసారి మాత్రమే అందులో ఒకేఒక సారి ఎస్సీ ముఖ్యమంత్రి అయ్యారు. అగ్రవర్ణాలకు రాజ్యాదికారం తప్పా 85 శాతం బీసీలు ఉన్న విద్యా, ఉద్యోగ రంగాలలో గాని రాజ్యాంగం కల్పించిన హక్కు ఎందుకు దక్కటం లేదని అన్నారు. పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలకు సిద్ధంగా ఉన్నామని ఆ క్రమంలో పార్టీని బూత్లవల్ కమిటీలు వేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఆర్టికల్ 14, 15, 16,46, 350 ఎందుకు అమల్లోకి రావటం లేదని అన్నారు. బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెనవేరటం లేదని అన్నారు. మా హక్కులు మాకు దక్కేంత వరకు మా పోరాటం ఆగదని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మండపల్లి చర్చిలో ప్రార్థనలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త):** మండపల్లి హోలీ బాప్టిస్ట్ చర్చి లో గిరిజన ప్రాంతాలలో జరుగుచున్న హింసలకు, పుల్వామా దాడుల నేపథ్యంలో పురస్కరించుకొని బ్లాక్ డే నిర్వహించారు.రెవరెండ్. డి. ఏలీయా పాస్టర్ ఆధ్వర్యంలో అనేక మంది దైవ సేవకులు పెద్దలు విశ్వాసులు పాల్గొనిరి ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. వర్తమానం రెవరెండ్. యు వి జాన్ సన్ విచ్చేసి ఉజ్జీవా కారణమైన సందేశం ఇచ్చారు. ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ పాల్గొని నివాళులు అర్పించారు, ఇచ్ఛాపురం ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి అధ్యక్షులు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మైనారిటీ కో ఆప్షన్ సభ్యులు ప్రత్తి. విజయ కుమార్ , వీరకుమార్, బిషప్. రెవరెండ్. భీమ్ బెహరా గ, రెవరెండ్. డి. ఆనంద్ , శశిభూషాన్ , రెవరెండ్ శంకర్ , మల్లేష్ , రెవరెండ్ శేఖర్ పాస్టర్ ఇంకా అనేకమంది దైవ సేవకులు పాల్గొని దేశం ,రాష్ట్రం ప్రపంచ ఐక్యత కోసం ఘనముగా ప్రార్థన లు చేసి ముగించారు.



# పలాస అభివృద్దే లక్ష్యం: వెంకన్న చౌదరి

### -మండల అధ్యక్ష కార్యదర్శులతో కీలక భేటీ

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** పలాస నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి శనివారం ఒక కీలక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయి, క్షేత్ర స్థాయి సమస్యలు, రాజకీయ పరిస్థితులపై లోతుగా సమీక్షించారు."లీడర్ విత్ క్యాడర్" స్ఫూర్తితో ముందుకు ఈ సమావేశాన్ని కేవలం సమీక్షకే పరిమితం చేయకుండా, "లీడర్ విత్ క్యాడర్" అనే కార్యక్రమ స్ఫూర్తితో నిర్వహించారు. నాయకులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ, ఆత్మీయ వాతావరణంలో ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. మండలాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన మార్గాలను అన్వేషించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సంబంధిత నాయకులకు వెంకన్న చౌదరి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలే తక్షణ కర్తవ్యం రానున్న స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన నాయకులకు పిలుపునిచ్చారు. ఎన్నికల దృష్ట్యా క్షేత్ర స్థాయిలో ఉన్న సవాళ్లను తెలుసుకొని, వాటిని అధిగమించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఈ సమావేశంలో చర్చించారు. నాయ కులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబు రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్, పలాస వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గాలి కృష్ణారావు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, కార్యదర్శి సాలిన మాధవరావు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్య దర్శి సప్ప నవీన్, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు సూరాడ మోహన్ రావు, మల్లిపెద్ది నరేంద్రబాబు, కార్యదర్శి కర్ని రమణ, సవర రాంబాబు, కొత్త సత్యం, టంకల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు. ఈ సమావేశం నియోజకవర్గ అభివృద్ధి పట్ల, పార్టీ బలోపేతం పట్ల వెంకన్న చౌదరికి ఉన్న నిబద్ధతను, దార్శనికతను స్పష్టం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



## రాగి జావా నాణ్యత..ఎంఈఓల తనిఖీ

### - పాగోడు ప్రభుత్వ పాఠశాలలో పరిశీలన



**జలుమూరు, ఫిబ్రవరి 14(వార్త):** పాగోడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అందజేస్తున్న రాగి జావా నాణ్యతను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ ఎస్ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన అధికారులు విద్యార్థులకు అందిస్తున్న రాగి జావా రుచి, నాణ్యతను స్వయంగా పరీక్షించారు. పోషకాహార కార్యక్రమం సమర్థవంతంగా అమలు అవుతోందా అనే విషయాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ సభ్యులకు పలు సూచనలు చేశారు. రాగి జావాను రుచికరంగా, పరిశుభ్రత ప్రమాణాలతో తయారు చేసి సమయానికి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పోషకాహార కార్యక్రమాలు సమర్థంగా కొనసాగాలంటే అధికారులు, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

## అంకెల గారడీ, మోసాల బడ్జెట్



**నరసన్నపేట, ఫిబ్రవరి 14(వార్త):** నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బడ్జెట్ కేవలం అంకెల గారడిగా మిగిలిపోయిందని, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన స్పష్టమైన దిశానిర్దేశం లేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి, మహిళా సంక్షేమం, పేదల అభివృద్ధి వంటి కీలక అంశాలపై బడ్జెట్‌లో ఎటువంటి స్పష్టత లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా బడ్జెట్ ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హామీల అమలుపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శివరాత్రికి ముస్తాబైన ఉమారుద్ర కోటేశ్వరస్వామి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (వార్త):** మా రుద్ర కోటేశ్వర స్వామి వారి సన్నిధి మహాశివరాత్రి సందర్భంగా సర్వ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి భక్తులకు దర్శనం ప్రారంభమవుతుంది. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని క్యూ లైన్లు కౌంటర్లను పెంచారు. భక్తుల సందర్శన 22 సీసీ కెమెరాలు పర్యవేక్షణలో జరుగుతుంది. భక్తుల అవసరార్థం మజ్జిగ, మంచినీరు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఆలయ దర్శనం కోసం ఎటువంటి పాసులు మంజూరు చేయడం లేదు. సుమారుగా 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల రద్దీ నిమిత్తము 150 మంది పోలీసులతో రూరల్ సీఐ పైడపు నాయుడు ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయుచున్నారు. ఎటువంటి పొరపాట్లకు తావీయకుండా భక్తులు ఆలయ సిబ్బందికి పోలీసు వారికి సహకరించాలని ఆలయ ఈ.వో సుకన్య, చైర్మన్ దేవేంద్ర నాయుడు కోరుతున్నారు.



## మూడేళ్లుగా గౌరవ వేతనాలకు నోచుకోని ఎంపీటీసీలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త):** గత మూడేళ్ళుగా ఎంపీటీసీ లకు గౌరవ వేతనాలు చెల్లించండం లేదని సభ్యులు నిరసన తెలియజేశారు. మండల సమావేశంలో ఎంపిపి బోర పుష్ప వైస్ ఎంపిపి లు దువ్వు వివేకానంద రెడ్డి, దున్న గురుమూర్తి తో పాటు ఎంపీటీసీ లు నిరసన తెలిపారు. ఎంపిడిఓ ప్రభాకర్ రావు కి వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ సి ఎఫ్ ఎమ్ ఎస్ లో అప్ లోడ్ చేయడం జరిగిందని 50 శాతం వేతనాలు 13 .29 లక్షలు జమ చేయడం జరిగిందని చెప్పారు.

## శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై అర్చన సమీక్ష

### - భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచన



**జలుమూరు, ఫిబ్రవరి 14(వార్త):** శ్రీముఖలింగంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం పరిశీలించారు. నరసన్నపేట టీడీపీ సమన్వయకర్త అర్చన బగ్గు మధ్యాహ్నం ఆలయానికి చేరుకుని దేవాదాయ శాఖ అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి భక్తుల సహకారంతో విజయవంతం చేయాలని కోరారు. ఇదే సందర్భంగా శ్రీముఖలింగ మధుకేశ్వర దేవాలయంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను ఆర్డీవో సాయి ప్రత్యూష కూడా పరిశీలించారు. భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, తీర్థప్రసాదాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్, దేవాలయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. సాధారణ భక్తులందరికీ స్వామి దర్శనం, తీర్థప్రసాదాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ఈవో ఏడుకొండలు సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్యకు రమణమాదిగ నివాళి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (వార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి కార్యక్రమం సందర్భంగా శ్రీకాకుళంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలు వేసి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలికులు సవలాపురపు వెంకటరమణ మాదిగ, ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు.ఈ సందర్భంగా రమణ మాదిగ మాట్లాడుతూఈ సందర్భంగా రమణ మాదిగ దామోదర్ సంజీవ్ జీవితచరిత్రను ఒకసారి గుర్తు చేసుకుంటూ తన చిన్నతనములోనే తండ్రిని కోల్పోయారని తల్లి సంరక్షణలోనే తన చదువును కొనసాగిస్తూ చదువు పూర్తయిన తర్వాత కొంతకాలం ప్రభుత్వ ఉద్యోగగా పని చేస్తూ తర్వాత కాలంలో రాజకీయాల్లో చేరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుమా రెండు సంవత్సరాలు దాటి పనిచేసే ఘనత వహించిన వ్యక్తిగా ఉన్నారు. అలాగే ఆల్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పనిచేసే అవకాశం రావడం అనేది ఒక చరిత్రగా భావించాలని అంటూ శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు ను బామిని మండలం నేరేడు గ్రామ వద్ద శంకుస్థాపన చేసి శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా ప్రజలకు, తాగు నీరు, వ్యవసాయనికి సాగు నీరు అందివ్వా లని వంశధార ప్రాజెక్ట్ ని ఆనాడు శంకుస్థాపన చెయ్యడం జరిగింది అని గుర్తు చేసుకొన్నారు. అలాగే శ్రీకాకుళం లో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు చదువుకోసం చెప్పి ఆనాడు శ్రీకాకుళం డిగ్రీ కళాశాల పురుషులది శంకుస్థాపన చేసి, శ్రీకాకుళం జిల్లా కు విద్యా పునాది వేసి ఈరోజు అనేక వేల మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను పొంది అనేక రకాలుగా దేశ, విదేశాల్లో ఉండడానికి బలమైన పునాది ఆనాడే చేశారు అని గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో అనేక అభివృద్ధికి పునాదులు వేసిన మూలకారకుడుగా దామోదర్ సంజీవని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పదంలో రావడానికి పారిశ్రామిక నీటిపారుదల విద్యా ఉపాధి రంగాల్లో అనేక కార్యక్రమాలు చేసిన ఆయన చేసిన కార్యక్రమాలు చేసిన ఆయన ఆనాటి నుండి నేటి వరకు వాటి ఫలాలు ఇప్పుడున్న ప్రజలు కూడా అందుకుంటున్నారని ఈ సందర్భంగా అన్నారు. అలాంటి విశిష్ట మైన వ్యక్తి విగ్రహాన్ని వంశధార ప్రాజెక్టు ప్రాంతంలో అనగా హిరమండలం రిజర్వాయర్ దగ్గర అలాగే ఎక్కడైతే నేరేడు దగ్గర శంకుస్థాపన చేశారో ఆ ప్రాంతంలో ఆయన విగ్రహాలని ఏర్పాటు చేసి భావి భారత పౌరులకి శ్రీకాకుళం జిల్లా ప్రజలకి ఆయన చేసిన సేవలు నిరంతరము గుర్తుండే విదంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, ప్రభుత్వ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ విషయన్ని పరిశీలించి ఆయన విగ్రహాలని ఏర్పాటు చేసే చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని రమణ మాదిగ తెలిపారు.

## వార్షిక బడ్జెట్ అద్భుతం : వజ్జ



**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అద్భుతంగా ఉందని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ఇది అభివృధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇచ్చి జోడెద్దుల బండి వలె పరుగులు పెట్టే బడ్జెట్ అని ప్రశంసించారు. కేంద్ర బడ్జెట్లో వికసిత్ భారత్, రాష్ట్ర బడ్జెట్‌లో స్వర్ణాంధ్ర లక్ష్యం కనిపిస్తుందన్నారు. రహదారులు, విమానాశ్రయాలకు, పోర్టులకు 13వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని అన్నారు. అనుకున్నదానికంటే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పవన్ కళ్యాణ్ సహకారంతో మోడీ నేతృత్వంలో మన రాష్ట్రం మరింత ముందుకు వెళుతుందని, ఈ బడ్జెట్ నిరూపించింది. ఈ బడ్జెట్ భవిష్యత్ లో విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, టూరిజం హబ్ గా తీర్చిదిద్దడానికి చేయడానికి జలమిషన్ కార్యక్రమంలో భాగంగా సాగు నీరు త్రాగు నీరు అందేందుకు మరింత ఊతం ఇస్తుంది.

## శ్రీ వెంకటసాయి విద్యాసంస్థలో వీడ్కోలు సభ



**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 14 (వార్త):** సరుబుజ్జిలిలోని శ్రీ వెంకట సాయి విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకి, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు.. ఈ సమావేశంలో ముఖ్యఅతిది విద్యాసంస్థల చైర్మన్ కే జగన్నాథం మాట్లాడుతూ కష్టపడితే విద్యార్థులకు అత్యుత్తమ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.పురుషోత్తమరావు, ఏవో సీతారాం, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పుల్వామా అమరవీరులకు నివాళులు

### -మాజీ సైనికుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### దేశభక్తిని చాటుకున్న

### పలాస-కాశీబుగ్గ మొబైల్ టెక్నీషియన్లు

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలర్పించిన వీర జవాన్ల త్యాగాలను స్మరిస్తూ మా మాజీ సైనికులు, పలాస-కాశీబుగ్గ మొబైల్ టెక్నీషియన్ వెల్ఫేర్ యూనియన్ సభ్యులు వినూత్నంగా నివాళులర్పించారు. దేశ రక్షణలో సైనికుల త్యాగాలు నిరూపించుకుంటూ రక్తదాన శిబిరం మాజీ సైనికులు ఏర్పాటు చేసి అమరావతి త్యాగాలను స్మరించుకున్నారు. కేవలం మొబైల్ రిపేర్లకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలోనూ తాము ముందుంటామని చాటిచెబుతూ భారీ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. యూనియన్ సభ్యులతో పాటు స్థానిక యువత ఈ రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. అమరుల త్యాగం వెలకట్టలేనిది. వారి స్మరణార్థం చేసే ఈ రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం కావాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం" అని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన జవాన్ల జ్ఞాపకార్థం, ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడేందుకు రక్తాన్ని అంకితం చేయడంమాబాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. పుల్వామా అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జవాన్ల త్యాగాలను స్మరిస్తూ యూనియన్ సభ్యులు చేసిన ఈ కృషిని స్థానికులు ఎంతగానో అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, మాజీ సైనికులు, పవనపుత్ర సేవా సంస్థ సభ్యులు, యువత పాల్గొన్నారు.



## జెడ్పీ పాఠశాలలో సందడిగా ఫుడ్ ఫెస్టివల్

### - పౌష్టికాహారంపై విద్యార్థుల్లో చైతన్యం

**జలుమూరు, ఫిబ్రవరి 14(వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను సందడిగా నిర్వహించారు. పౌష్టికాహార ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు హెచ్‌ఎం వకుళా రత్నమాల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజూ సమతుల్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ ఇళ్ల వద్ద నుంచి తయారుచేసి తీసుకొచ్చిన పలు రకాల వంటకాలను ప్రదర్శించారు. మరికొందరు పాఠశాలలోనే వంటకాలు తయారుచేసి ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. పలు రకాల ఆరోగ్యకరమైన వంటకాలతో ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు.



## గ్రామాల్లో టీడీపీ బలోపేతమే లక్ష్యం

**జలుమూరు, ఫిబ్రవరి 14(వార్త):** జలుమూరు మండలంలోని కరకవలస గ్రామంలో టీడీపీ బూత్ స్థాయి నాయకులు, ఇన్చార్జ్‌లతో రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ గోవిందరాజులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, వాటి లబ్ధిదారులను చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ బూత్ కమిటీలను చురుకుగా పనిచేయించడంతో పాటు, ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన నాయకులకు సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు విధానం, పార్టీ కార్యక్రమాలపై సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ జామి వెంకట్రావు, బూత్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# దామోదరం సంజీవయ్యకు ఘన నివాళులు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి పురస్కరించుకొని శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. అదనపు ఎస్పీ కేవీ రమణ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ఉమ్మడి ముఖ్యమంత్రిగా సేవలందించిన మహాను భావుడని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రజా సేవలో నిబ ద్ధత, నిజాయితీ, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన కట్టుబాటు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, డిసిర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పుల్వామా అమరవీరులకు నివాళులు



**నరసన్నపేట, ఫిబ్రవరి 14(వార్త):** నరసన్నపేట మండలంలోని నర్సింగపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్ఎం పాటోజు తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల సేవలను గుర్తుచేసుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులు దేశ చరిత్రలో చోటుచేసుకున్న ముఖ్య ఘటనలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పుల్వామా దాడి నేపథ్యం, దేశ రక్షణలో సైనికుల పాత్రపై విద్యార్థులకు వివరించారు. దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ముస్తాబైన బ్రాహ్మణతర్ల



**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** పలాస నియోజకవర్గం బ్రాహ్మణతర్ల గ్రామంలో ఆదివారం ఫిబ్రవరి 15 తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు సౌకర్యార్థం కోసం బ్రాహ్మణతర్ల జడ్పీ హైస్కూల్ గేట్ నుంచి శ్రీశ్రీ ఉమాకామేశ్వర ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా శానిటేషన్ ను జెసిబి మిషన్ ద్వారా పూర్తిగా తొలగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వడ్డీ యాదగిరి, పలాస యూనిట్ కో కన్వీనర్ ఆళ్ల. కృష్ణారావు శాసన పూరి వెంకట్రావు, పాల్గొనగా శానిటేషన్ చేయుటకు ఆళ్ల కృష్ణారావు సొంత ఖర్చులు వెచ్చించారు.

## అధికారులకు సహకరించండి

### -ఆర్డీవో జి.వెంకటేష్

**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** శివరాత్రి పురస్కరించుకొని ప్రజలందరూ అధికారులకు సహకరించాలని ప్రజలు పలాస రెవెన్యూ డివిజినల్ అధికారి జి వెంకటేష్ చూసించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం చేస్తున్న శివరాత్రి పట్ల పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని శివాలయాలు, ఇతర దేవాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో దర్శనార్థం తరలివచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు దర్శనం చేసుకునే సమయంలో క్రమశిక్షణగా ఉండి, పోలీసు, రెవెన్యూ శాఖల సూచనలు పాటించాలని, ఆలయ ప్రాంగణాలలో రద్దీని నివారించేందుకు సహకరించాలని ఆయన సూచించారు. వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని, ఎలాంటి అప్రమత్తత లేకుండా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాగునీరు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప అధికారులను లేదా పోలీసు సిబ్బందిని సంప్రదించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని శాంతి, భక్తి భావాలతో జరుపుకోవాలని కోరుతూ పలాస రెవెన్యూ డివిజినల్ అధికారి జి వెంకటేష్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

### -సామాజికవేత్త జుత్తు తాతారావు



**పలాస, ఫిబ్రవరి 14 (వార్త):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త జుత్తు తాతారావు పలాస నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి రోజున భక్తిశ్రద్ధలతో శివనామం జపిస్తూ చేపట్టే ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ, పూజలు, అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో ఆత్మశుద్ధిని, పరివర్తనను కలిగిస్తాయని జుత్తు తాతారావు స్పష్టం చేశారు.

## 12 పశువుల పట్టివేత

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 14 (వార్త):** ఒడిస్సా నుండి రెండు బొలెరో వ్యాన్ లో 12 పశువులు ను అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పురుషోత్తాపురం చెక్ పోస్ట్ వద్ద టౌన్ ఎస్ ఐ ఎం ముకుంద రావు పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి ఆ పశువులను విజయనగరం గోశాల కు తరలించి నట్లు తెలిపారు.రెండు వాహనాలు లో అరేసి దున్న పోతులు ఎటువంటి జాగ్రత్తలు లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.








# ఆధ్యాత్మిక ఝరి..

-మహాశివరాత్రికి ప్రత్యేక యాత్ర -లక్షల మంది భక్తులు రాక

-ఆంధ్రా, ఒడిశాల నుంచి రహదారి -ఒడిశా నుంచి మంచి రహదారి సౌకర్యం

# మహేంద్రగిరి





**(మందస)** హే భీమ... హేభీమ... అంటూ పచ్చని అరణ్యం మధ్య నుంచి భక్తుల జనఘోష వినిపిస్తుంటుంది. ఏడాది పొడవునా నిశ్శబ్ధంగా ఉన్న గిరుల ప్రాంతం అప్పుడప్పుడు క్రూర మృగాల అరుపులు మాత్రం ఆ నిశ్శబ్ధాన్ని భంగపరుస్తుంటాయి. కానీ, కేవలం ఏడాదిలో మూడు రోజులు మాత్రం ఆ ప్రాంతంలో చైతన్యం నిండిపోతుంది. దట్టమైన ఆంధ్రా-ఒడిశా అడవుల మధ్య ఉన్న మహేంద్రగిరికి కొండంత భక్తితో భక్తులు తరలివస్తారు. దక్షిణ భారతదేశంలో తూర్పు కనుమలు అతి ఎత్తైన శిఖిరం మహేంద్రగిరులు. పెద్ద పెద్ద వృ క్షాలు... లోతైన లోయలు... అమూల్య ఔషధ మూలికలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. వీటి మధ్యలో అతి ఎత్తైన పర్వతాలే మహేంద్రగిరులు. ప్రకతి సౌందర్యమే కాకుండా, ఆధ్యాత్మిక వైభవాన్ని కలిగిన ఈ మహేంద్రగిరులు తూర్పు కనుమల్లోని గంజాం జిల్లా ఒడిశా-ఆంధ్రా సరిహద్దులో విస్తరించి ఉన్నాయి. సముద్రానికి సుమారు 5వేల అడుగుల ఎత్తులో ఉంది. మహాశివరాత్రి సందర్భంగా మహేంద్ర గిరులపై మూడు జరిగే యాత్రకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస గ్రామానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. భక్తులు మజిలీ చేసుకుని కేవలం కాలినడకనే భక్తులు కష్టాన్ని భరించి, గిరులపై ఉన్న ఆలయాలను చేరుకుంటారు. సుందరమైన ప్రకతిని చూసి, తన్మయత్వం చెందుతారు. గల గల పారే సెలయేర్లు... కుహూ కుహూ రాగాలాలిపించే కోయిలలు... వింత ధ్వనుల చేసే పక్షులు... కనుచూపు మేర శోభను చేకూర్చే ఎన్నో రకాల వ క్షాలు... మత్తెక్కించే పూల పరిమళాలు ఆహ్లాదపు అనుభూతినిస్తాయి. మహేంద్రగిరులపై పంచ పాండవులు నిర్మించాయని పురాణాలు చెబుతున్న ఆలయాలున్నాయి. అతి ఎత్తైన ఈ కొండలపై పెద్ద, పెద్ద రాతి పలకలతో నిర్మించి, ఆలయాలను చూస్తే, వీటి నిర్మాణం చూస్తే కష్టసాధ్యమనిపిస్తుంది. రవాణా సౌకర్యంలేని ఎత్తైన ఈ కొండపైకి పెద్ద పెద్ద రాళ్లు ఎలా తరలించారో... ఎందరు శిల్పులు శ్రమించారో ఊహించడం కష్టం. అందువలనే ఈ ఆలయాలను పాండవులు నిర్మించారంటే విశ్వసించకతప్పదు. భక్తులు ముందుగా చేరుకునే కుంతీదేవి ఆలయం. రెండు కొండల మధ్య ఉంటుంది. ముఖద్వారం పశ్చిమ దిశగా ఉంది. దక్షిణ భాగాన విఘ్నేశ్వరుడు, తూర్పున కుమారస్వామి, ఉత్తరాన పార్వతీదేవి విగ్రహాలు ఆలయం వెలుపల ఉంటాయి. ఎదురుగా ఒక మంచినీటి బావి ఉంది. లక్షలాది యాత్రికులకు నీరు అందిస్తుంది. కుంతీదేవి ఆలయానికి దగ్గరలో విశాలమైన ప్రదేశం ఉంది. ఈ భాగమంతా రాతితో కప్పబడి ఉంది. అక్కడే ధర్మరాజు ఆలయం ఉంది. పశ్చిమ దిశగా ఆలయం ఉండగా, కుంతీ ఆలయానికి ఈ ఆలయం పెద్దదిగా ఉంది. ధర్మరాజు ఆలయం భూమిలోకి కొంతభాగం దిగినట్టుగా ఉంటుంది. భక్తులు మెట్లును దిగి, వెడల్పుగా పొట్టిగా ఉన్న లింగాన్ని దర్శించుకుంటారు. మెట్లు మాదిరిగా రాతి పలకాలతో నిర్మించబడి ఉంది. కుడిపక్కగా ఓ చిన్న ఆలయం ఉంది. పురిగుడిసెలా ఉన్న ఈ ఆలయాన్ని సహదేవుని ఆలయంగా చెబుతారు. ముఖద్వారం తూర్పు దిశగా ఉంటుంది. ఎదురుగా కొద్దిదూరంలో సహదేవుని ఆలయం మాదిరిగానే నకుల, ద్రౌపది ఆలయాలుంటాయి. ధర్మరాజు ఆలయానికి ఎదురుగా పశ్చిమదిశ వైపు నాలుగు కొండ శిఖరాలున్నాయి. వీటిలో మధ్య రెండు శిఖరాలపై భీమార్జున ఆలయాలున్నాయి. భీముని కోవెల కుంతీ, ధర్మరాజుల ఆలయాల కంటే చిన్నదిగా ఉంది. విశేషమేమిటంటే రెండింటి నిర్మాణం కంటె భిన్నంగా ఉంటుంది. 5 పెద్దరాళ్లతో పాటు మొత్తం 24 రాళ్లతో ఆలయ నిర్మించారు. కానీ, మూడు రాళ్ల మధ్య పగులు ఏర్పడగా, నాలగవది ఒకే రాయి కాగా పైన ఉన్న రాయి గుండ్రంగా చెక్కి ఉంటుంది. తూర్పునకు ముఖద్వారం ఉండగా, పశ్చిమ వైపు చిన్న ఇరుకు నిష్క్రమణ ద్వారం ఉంది. ఇరుకుగా ఉన్నప్పటికీ భక్తులు వెలుపలకు రావడం ప్రత్యేకత. కొంతమంది భక్తులను పోలీసుల బయటకు లాగుతుంటారు. క్రూర మ గాలు తిరుగుతున్న మహేంద్రగిరుల అరణ్యంలో భక్తులకు ఎటువంటి హాని చేయకపోవడం విశేషం. అంతేకాదు, అవి ఎవరికి కనబడకపోవడం ఆశ్చర్యకరం. భీముని ఆలయం నుంచి కిందకు చూస్తే, నాగావళి, వంశధార, బహుదా చిన్న పిల్లకాలువల్లా బంగాళాఖాతం సముద్రంలో కలవడం కనిపిస్తుంది. సముద్రం వెండి జరీచీరలా ఉంటుంది. చీకటి పడితే పట్టణాల్లో గల విద్యుత్ దీపాలు మిణుగురు పురుగుల్లా కనిపిస్తాయి. అదోక విచిత్రానుభూతిగా భక్తులు చెబుతారు. భీముని ఆలయానికి కుడివైపుగా మరో శిఖరం ఉంది. అక్కడ అర్జునుని ఆలయం లేనప్పటికీ, ఆధారాలున్నారు. శబ్దభేరిని అనగా వస్తువు కనిపించకపోయి, అస్త్రప్రయోగం చేసిన స్థలంగా చెబుతారు. పక్కనే చిందరవందరగా పెద్దపెద్ద బండరాళ్లు ఉన్నాయి. భక్తులు ఇందులో నుంచి వెళ్లి, బయటకు వస్తారు. పాండవులు లింగ ప్రతిష్ట అనంతరం వారు ఈ మార్గం గుండా వెళ్లారని పురాణ కథనం. దీనినే సొరంగమార్గం అంటారు.



### స్థల పురాణం..

అర్జునుడు మనోవేగం కలవాడై, ఇంద్రనేర పర్వతం చేరి, ఇంద్రుని సాక్షాత్కారం పొంది, సర్వేశ్వరుని అనుగ్రహానికి మహాగిరి వచ్చాడని, ఆ మహాగిరే మహేంద్రమని చెబుతారు. త్రేతాయుగంలో క్షత్రియులను సంహరించి శపథాన్ని నెరవేర్చుకున్న పరశురాముడు కోటి శివలింగాలతో ప్రకాశించే శైవ క్షేత్రమైన సప్తకుల పర్వతాల్లో ఒకటైన మహేంద్రగిరి శిఖరంపై తపోస్సాధన వచ్చాడని, ఈ కాలంలో సంపాతితో సంభాషించే సీతాన్వేషణకు సాగరాన్ని దాటిందేకు హనుమంతుడు కూడా మహేంద్రగిరుల నుంచే వెళ్లాడని ప్రతీక. అర్జునుడు పిత కార్యం చేసేందుకు వేటాడే సమయంలో కపిలగోవు చావుకు కారకుడవుతాడు. గోవు చనిపోయిన స్థలంలో కోటి లింగాలు వెలసి కోటి లింగేశ్వర దేవాలయమైందని, ఇదే మహేంద్రగిరులకు సమీపంలోని బారువాలో ఉందని, మతదేహాన్ని తీసుకెళ్లినప్పుడు గోవు గర్భంలోని పొత్తు(ప్రేగులు) జారిపడిన ప్రదేశంలో పొత్తేశ్వరుడు వెలిశాడని, అదే నేడు పొత్తంగి గ్రామంలో ఉందని పెద్దల నమ్మకం. మహేంద్రగిరులు చేరగా, దారిలో గోకర్ణములు జారి పడగా అక్కడనే గోకర్ణేశ్వరుడు వెలిశాడని చెబుతారు. పాండవులు గోహత్య దోషం పోవడానికి కుంతీదేవితో ఆరు ఈశ్వర లింగాలను ప్రతిష్టించి, ఆలయ నిర్మాణాలను చేసి, సొరంగమార్గం గుండా వెళ్లిపోయారని మరో కథ ప్రచారంలో ఉంది. మహేంద్రగిరులపై దారుబ్రహ్మ గుహల్లో విశ్వవసువ అనే శబరుడు జగన్నాథస్వామి నీలామాధవుని అర్థించాడు. జర అనే శబరుడు తన శరంతో శ్రీకష్ణుని కొట్టిన తరువాత ఆ పరమపురుషుడు అవతారం చాలించింది ఇక్కడేనని పురాణ కథనం.

### చారిత్రకుల విశ్లేషణ

వెలకట్టలేని విలువ పుట్ట పురాతన గుట్టలు కట్టడాల వంటి ఆధారాలు ఇప్పటికీ నిక్షిప్తంగా దాగి ఉండి, మనల్ని ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయంటే, శిల్పకారుల చేయి చలువే. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా, వారు నిర్మించిన ఈ ఆలయాలు నేటికీ సజీవంగా విచ్చుకుని, పరిమళిస్తున్నాయి. చరిత్రకు ఆధారాలుగా నిలిచాయి. దేవాలయాలు ఒకే కాలంలో ఒకే రాజుకట్టినవి కాదని, మూడు రాజు వంశాలు కట్టినవి చరిత్రకారుల అభిప్రాయం. హస్తివర్మ, ఉర్లాం శాసనంలో క్రీస్తు శకం 577గోకర్ణేశ్వరస్వామి గురించి రాశారు. ఈ శాసనాల ఆధారంగా ఈ క్షేత్రం 6వ శతాబ్ధానికే ముందే వెలుగులోకి వచ్చిందన్న అంశం నిర్వవాదాంశం. కళింగ రాజ్యాన్ని పాలించిన గంగ వంశ రాజ్యులు గోకర్ణేశ్వరుని భక్తులు. మహేంద్రగిరులపై ఉన్న ధర్మరాజు గుడి నిర్మాణ శైలికి, శ్రీముఖలింగం ఆలయాలకు పోలికలు ఎక్కువగా ఉన్నందున ధర్మరాజు ఆలయానికి క్రీస్తు శకం 8వ శతాబ్దంలోనే గంగ వంశపు రాజులే నిర్మించ ఉండవచ్చును. మూడేసి రాళ్లు చెక్కి, పేర్చి సున్నం లేకుండ నిర్మాణశైలి క్రీ.శ. 10-12 శతాబ్దాల మధ్య తూర్పు చాళుక్యుల కాలంలో ప్రసిద్ధి పొందింది. మహేంద్రగిరిపై ఉన్న భీమాలయం చాళుక్యులు నిర్మించిన బిక్కవోలు ఆలయాలను పోలి ఉండడంతో భీమాలయం చాళుక్యులు నిర్మించారని నమ్మకం. క్రీస్తు శకం 1455లో కటకం పాలించిన గజపతుల కాలంలో ఉత్కళ శిల్ప శైలి అభివద్ధి చెందింది. పొత్తేశ్వర ఆలయం వీరు నిర్మించినట్టు శిలాశాసనం ద్వారా వెల్లడవుతోంది. కుంతీ ఆలయం కూడా వద్ర శిల్పాన్ని పోలి ఉండడంతో ఈ ఆలయాన్ని కూడా గజపతులే నిర్మించారని భావిస్తున్నారు. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉన్న మహేంద్రగిరులపై మరిన్ని పరిశోధనలు జరిపితే, ఎన్నో చారిత్రాత్మక రహస్యాలు వెలుగులోకి వస్తాయి.



### మహేంద్రగిరులకు వెళ్లడానికి దారి ఇదే..

శ్రీకాకుళం జిల్లాలోని పలాస రైల్వే స్టేషన్లో దిగాలి. అక్కడి నుంచి మందస మీదుగా సాబకోట వరకు పలాస డిపో యాజమాన్యం బస్సులు నడుపుతుంది. సాబకోట నుంచి మహేంద్రగిరులకు కాలినడకను మాత్రమే వెళ్లగలరు. రాజులు బస చేసే ప్రాంతాన్ని రాజబసగా పిలుస్తారు. రాజబస వరకు ద్విచక్ర వాహనాలు, జీపులు, ట్రక్కర్లు కష్టమ్మీద వెళ్తాయి. కాగా, ఒడిశాలోని కొయిపూర్ మీదుగా గిరులపైకి దారిని ప్రభుత్వం నిర్మించింది. ఒడిశా ప్రభుత్వం మహేంద్రగిరులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతోంది. ఆంధ్రా నుంచి కూడా తారురోడ్డు నిర్మిస్తోంది. సాబకోట నుంచి చొంపాపురం మీదుగా.. ఒడిశా సరిహద్దు నుంచి మహేంద్రగిరులను చేరుకోవడానికి వాహనాల రాకపోకలకు ఒడిశా ప్రభుత్వం మంచి రహదారి నిర్మాణం చేపట్టి, పూర్తి చేయడానికి సిద్ధం చేస్తోంది.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546